రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

పుల్కల్, సెప్టెంబర్ 27: రాష్ట్ర స్థాయి పోటీలకు సింగూరు గురుకుల కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఆగమయ్య, పీడీ కృష్ణ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం కొండాపూర్ మండల పరిధిలోని గిర్మాపూర్ పాఠశాలలో అండర్-19 బాలురు, బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సింగూరు కళాశాల విద్యార్థులు 8 మంది ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు యా దుల్, ప్రశాంత్, ప్రణయ్, మున్నా, ప్రవీణ్, తరుణ్, అశోక్, అజయ్‌ను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

శిల్పా వెంచర్‌లో అధికారుల సర్వే

సంగారెడ్డి/సదాశివపేట, సెప్టెంబర్ 27: మండల పరిధిలోని పెద్దాపూర్ శివారులో ఉన్న శిల్పా వెంచర్‌లో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు శుక్రవారం భూ సర్వే నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 65 జాతీయ రహదారిపై భారీగా వరద చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శిల్పావెంచర్‌లో మూడు మీటర్ల వెడల్పు ఉన్న నల్లవాగును మీటరున్నరకు కుదించి సుమారు రెండు కిలోమీటర్ల మేర వాగును ఆక్రమించారని ఆరోపణలు ఉన్నాయి. వాగును ఆక్రమించుకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చుట్ట పక్కల గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. వర్షం వచ్చి వాగు పొంగడంతో తమ పంటపొలాల్లోకి వర్షపు నీరు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వాగును కుదించడంతోనే జాతీయ రహదారిపై భారీగా వర్షపు నీరు చేరిందని ఆరోపిస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులు భూ సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరస్వతి మాట్లాడుతూ.. పట్టాదారుల ఫిర్యాదు మేరకు భూ సర్వే నిర్వహిస్తున్నామని, బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పర్వేను పరిశీలిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, ల్యాండ్ సర్వే అధికారులు

ఏవో లావణ్య సేవలు అభినందనీయం

జహీరాబాద్, సెప్టెంబర్ 27: మండల వ్యవసాయాధికారి లావణ్య రైతులకు ఎనలేని సేవలు చేశారని జహీరాబాద్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు భిక్షపతి కొనియాడారు. శుక్రవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వ్యవసాయాధికారులు, సిబ్బంది, నాయకులు, రైతులు కలిసి బదిలీపై వెళ్తున్న ఏవోతోపాటు, బదిలీపై ఏవోగా వచ్చిన ఆమె భర్త అభినాశ్‌వర్మను సన్మానించారు. కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏవో లావణ్యను సన్మానించిన అధికారులు, రైతులు

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచాలి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 27: మన సంస్కృతి, సంప్రదాయాలపైన విద్యార్థులకు అవగాహన పెంపొందించాల్సిన అవసరం అందరిపై ఉన్నదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. భారతీనగర్ డివిజన్‌లోని విద్యాభారతీ హైస్కూల్‌లో సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి గణిత, వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు వేడుకలో ఎంపీముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్‌ని ఆయన తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమంలో నాయకులు గోదావరి, దామోదర్‌రెడ్డి, అవధానులు, శ్రీనివాసరావు, గాల్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, సత్తయ్య, రాజానందం, భీమ్‌రావు, కృష్ణాగౌడ్, లక్ష్మణ్, ప్రిన్సిపాల్ పద్మజ, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

గజ ఈతగాళ్ల తో గాలించిన లభించని ఆచూకీ

జహీరాబాద్, సెప్టెంబర్ 27: మండల పరిధిలోని బూచినెల్లి శివారులోని నారింజ వాగులో రెండు రోజుల క్రితం గల్లంతైన షాకీర్ గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం నారింజవాగులో గజ ఈతగాళ్లను రప్పించి కిలో మీటర్ దూరం వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదని చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

నారింజవాగులో గల్లంతైన వ్యక్తి గాలింపు పరిశీలిస్తున్న ఎస్సై

బొంతపల్లి పంచాయతీ కార్యాలయంలో బాపూజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు



సంగారెడ్డి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు

కోహీర్: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహిస్తున్న తహసీల్దార్ బాలశంకర్

బాపూజీ సేవలు చిరస్మరణీయం

- వేడుకగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి
- విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. శుక్రవారం జిల్లాలో బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన తొలి, మలిదశ పోరాటాల్లో కీలకపాత్ర పోషించారన్నారు. తన జీవితాన్ని తెలంగాణ సాధనకు త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన జీవితం నుంచి నేటి తరం యువత అనేక అంశాలను నేర్చుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, సంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 27



సంగారెడ్డి కలెక్టరేట్ : తారా ప్రభుత్వ కళాశాలలో..

బొల్లారం : మున్సిపల్ కార్యాలయ ఆవరణలో..

పటాన్‌చెరు : బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

సంగారెడ్డి కలెక్టరేట్ : బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి తదితరులు

బీఆర్ఎస్ యువత అధ్యక్షుడిగా శ్రీకాంత్

సదాశివపేట, సెప్టెంబర్ 27: బీఆర్ఎస్ పట్టణ యువత అధ్యక్షుడిగా కొత్తకొండ శ్రీకాంత్ నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, నాయకులు యాదుల్, కామిల్, ఖాజా, మహేందర్‌రెడ్డి, అవుసలి సంగప్ప, జైన్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

తారా కళాశాలలో పర్యాటక దినోత్సవం

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 27: దేశాన్ని పర్యాటక పరంగా అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉన్నదని స్థానిక తారా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, యువ టూరిజం క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..మన పూర్వీకులు పర్యాటకపరంగా వివిధ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

న్యాయ సహాయ కేంద్రం ప్రారంభం

సంగారెడ్డి, సెప్టెంబర్ 27: పిల్లల సంరక్షణ, రక్షణ కోసం ఏర్పాటు చేసిన న్యాయ సహాయ కేంద్రాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర ప్రారంభించారు. శుక్రవారం పట్టణంలోని జువెనైల్ బోర్డులో ఈ కేంద్రాన్ని ప్రారంభించి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఎవరికైనా న్యాయ సలహాలు అవసరమైతే ప్రతి శుక్రవారం న్యాయ కేంద్రలో ఒక న్యాయవాదితో పాటు ఫారా లీగల్ వలంటీర్ అందుబాటులో ఉంటారని ఉచితంగా సేవలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి, జువెనైల్ జస్టిస్ బోర్డు జడ్జి శాలిని, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సహాయ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సదాశివపేట, సెప్టెంబర్ 27: కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, నర్సింహులు, కృష్ణమూర్తి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

ఇంటర్ డిస్ట్రిక్ పోటీలకు గురుకుల విద్యార్థులు

జిన్నారం, సెప్టెంబర్ 27: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి జరిగే అండర్-19 ఇంటర్ డిస్ట్రిక్ పోటీలకు జిన్నారం గురుకుల క్రికెట్ అకాడమీ విద్యార్థులు ఎంపికయ్యారని గురుకుల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ శుక్రవారం తెలిపారు. కే ప్రతాప్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు, డీ అంజి ఉమ్మడి మెదక్ జిల్లాల తరపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. క్రికెట్ పోటీలు వరంగల్‌లో జరుగుతాయన్నారు. ఈ పోటీలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తుందని తెలిపారు. జిన్నారం గురుకుల అకాడమీ నుంచి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, క్రికెట్ కోచ్ మహేశ్ అభినందించారు.

ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, కోచ్ మహేశ్

రైతు సంక్షేమానికి డీసీఎంఎస్ కృషి

సంగారెడ్డి, సెప్టెంబర్ 27: జిల్లాలో మార్క్‌ఫెడ్ సంస్థ రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నదని, అన్నదాతలకు సకాలంలో ఎరువులు అందజేస్తుందని డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో పాత కలెక్టరేట్ కార్యాలయంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన మహాజన సభ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పని చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులపై మొసలి కన్నీరు కారుస్తూ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నదన్నారు. మహాసభలో ఎజెండా అంశాలపై ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు రమేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్లు జగన్మోహన్‌రెడ్డి, శివప్రసాద్, డీసీసీబీ సీఈవో శ్రీనివాస్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ ఆంజనేయులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్ శివకుమార్

గర్భిణుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూస్తాం

పటాన్‌చెరు, సెప్టెంబర్ 27 : గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహారం లోపం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషన్ అభియాన్-పోషణ మాసం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్లు అంగన్‌వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మహిళలకు సామూహిక సీమంతాలు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పోషకాహారం లోపంతో ఎదుగుదల లేని పిల్లలు పెరిగిపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్సీపురం కార్పొరేటర్ పుష్పనగేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, ఐసీడీఎస్ ప్రాజెక్టు మేనేజర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం

రాయికోడ్, సెప్టెంబర్ 27: గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన అవసరమని ఎంపీడీవో ఎంఎం షరీఫ్, జహీరాబాద్ ఐసీడీఎస్ సీడీపీవో అంజమ్మ అన్నారు. శుక్రవారం రాయికోడ్ ఐకేపీ కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సమావేశంలోవారు మాట్లాడారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ ఐకేపీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లతో పోషణ్ అభియాన్ అమలుపై ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఐకేపీ అధికారి నర్సింహులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మిర్జాపూర్‌లో..

జహీరాబాద్, సెప్టెంబర్ 27: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సృపేన్‌చక్రవర్తి అన్నారు. శుక్రవారం న్యాల్‌కల్ మండలంలోని మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధమ్మ, వైద్య సిబ్బంది మల్లికార్జున్, అనీత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సీమంతాలు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

జహీరాబాద్, సెప్టెంబర్ 27: చెరుకు సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని రాయికోడ్ మండలం మాటుర్‌లోని గోదావరి గంగా చక్కెర పరిశ్రమ మేనేజర్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ పరిశ్రమ ఆధ్వర్యంలో జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలాలకు చెందిన రైతులకు అధునీక పద్ధతులతో చెరుకు సాగుపై విధానాలపై అవగాహన కల్పించేందుకు మధ్యప్రదేశ్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు రోజుల పర్యటన ఈ ప్రాంత రైతులకు ఎంతగానో ఉయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గోదావరి గంగా చక్కెర పరిశ్రమ ఫీల్డ్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఓంకార్, ఆయా మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

కోహీర్, సెప్టెంబర్ 27: మండలంలోని దిగ్వాల్ గ్రామానికి చెందిన ఫీల్డ్ ఆఫీసర్ ఉపేందర్‌రెడ్డి నేతృత్వంలో పలు గ్రామాలకు చెందిన చెరుకు తోటల సాగుపై రైతులకు గోదావరి గంగా పరిశ్రమ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లో అవగాహన కల్పించారు. చెరుకు సాగు విధానం, చక్కెర, ఇథనాల్ తయారీ తదితర అంశాలను రైతులకు వివరించారు. అక్కడి రైతులు ఎకరానికి 60టన్నుల చెరుకు పండిస్తార్నారు. నూతన సాగు విధానాన్ని అమలు చేసి ఇక్కడి రైతులు అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

కోహీర్, సెప్టెంబర్ 27: తెలంగాణ యూటీఎఫ్ కోహీర్ మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బద్రుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా ప్రసన్న, ఉపాధ్యక్షులుగా రజియోద్దీన్, వాసవి, కోశాధికారిగా వెంకటేశ్వరరాజు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా విఠల్, క్రాంతి, రాము, పాండు, బలరాం, అన్నపూర్ణ, హబీబ్ బిన్ సయీద్ ఏకగ్రీవమయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా సాయితేజ, అధికారిగా ముకుంద వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా

జిన్నారం, సెప్టెంబర్ 27: భారీ గుంతల రోడ్డుపై అదుపు తప్పిన వాటర్ ట్యాంక్ బోల్తా పడగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ప్రమాదం గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని ఎల్లమ్మగుడి సమీపంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. అంత్యక్రియలకు ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీటిని తీసుకెళ్తుండగా ఎల్లమ్మ గుడి వద్ద గుంతల తేలిన రోడ్డుపై అదుపు తప్పి బోల్తా పడింది. ట్యాంకర్ పూర్తిగా తిరగబడింది. డ్రైవర్ మహేందర్ చేతికి గాయాలయ్యాయి.

ప్రణాళికాబద్ధంగా వార్డుల అభివృద్ధి

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ రోజాబాల్ రెడ్డి

బొల్లారం, సెప్టెంబర్ 27: ప్రజల అవసరాలకు అనుగుణంగా వార్డుల్లో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కోలన్ రోజాబాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 16, 17 వార్డుల్లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు కౌన్సిలర్లు చంద్రారెడ్డి, హనుమంత్ రెడ్డితో కలిసి చైర్‌పర్సన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మున్సిపల్ సాధారణ నిధులు రూ.50లక్షల చొప్పున రెండు వార్డుల్లో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ మంగతాయారు, ఏఈ కిష్టయ్య, మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కల్హేర్, సెప్టెంబర్ 27: జీవితంపై విరక్తితో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జరిగింది. ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాలు.. కల్హేర్ మండలం ఖానాపూర్ బీ గ్రామానికి చెందిన నమిల్ల హన్మాండ్లుతో కామారెడ్డి జిల్లా జూకల్ మండలం మాధపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి (21)తో ఆరు నెలల క్రితం వివాహమైంది. భార్య భర్తల మధ్య గొడవ జరగడంతో ఇటీవల ఇరు గ్రామాల పెద్ద మనుషులతో పంచాయతీ ఏర్పాటు చేసి ఇద్దరికి నచ్చజెప్పి కాపురాన్ని సజావుగా కొనసాగించుకోవాలని సూచించారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో గురువారం సాయంత్రం ఇంట్లో దూలానికి ఉరి వేసుకొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ దవాఖానకు తరలించామన్నారు. మృతురాలి తండ్రి చిట్టివాడ బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాపు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు

జిన్నారం, సెప్టెంబర్ 27: బొల్లారం పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఖాజీపల్లి పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 181 ప్రాంతంలో ఉన్న గుట్టపై శుక్రవారం మధ్యాహ్నం పేకాట ఆడుతున్నట్లు సమాచారం పోలీసులకు సమాచారం వచ్చింది. ఎస్సై దశరథ్ పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేశారు. తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రూ.14వేల నగదు, 8 బైకులు, 3 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులైన మత్స్యకారులకు సభ్యత్వాలు ఇవ్వాలి



మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్‌ను సన్మానిస్తున్న డైరెక్టర్ మహేశ్

జిన్నారం, సెప్టెంబర్ 27: అర్హులైన మత్స్యకారులకు సభ్యత్వాలు ఇవ్వాలని రాష్ట్ర మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ సాయికుమార్, తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్‌ను జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ సుంకరబోయిన మహేశ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన వారు జిల్లా మత్స్యశాఖ ఏడీకి ఫోన్ చేసి మత్స్యకారులకు ఇబ్బందులు కలగకుండా సభ్యత్వాలను నిబందనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారని తెలిపారు. అనంతరం మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ సాయికుమార్‌ను సన్మానించారు.

కలెక్టరేట్‌లో యువజనోత్సవాలు

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 27: ప్రపంచ పర్యాటన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పర్యాటక ర్యాలీని కలెక్టర్ వల్లూరు క్రాంతి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన సైన్స్ మేళాను సందర్శించి, వారి సృజనాత్మకతను అభినందించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థినీలు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రపంచ పర్యాటన దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఖాసీం బేగ్, టీఎన్‌జీవో అధ్యక్షుడు జావెద్ అలీ, యువజన సంఘాల అధ్యక్షుడు డాక్టర్ కూన వేణు, తారా ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జగగలశ్వర్, వివిధ సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల అవగాహన ర్యాలీ

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 27: మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వయోవృద్ధుల అవగాహన ర్యాలీని కలెక్టర్ వల్లూరు క్రాంతి కలెక్టరేట్ ఆవరణలో ప్రారంభించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో భాగంగా అక్టోబర్ 1వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల నేపథ్యంలో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్,